క్లుప్తంగా

రమాబాయి త్యాగం చిరస్మరణీయం

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సతీమణి రమాబాయి భీమ్ రావ్ అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి జెడ్పీటీసీతో పాటు పలువురు మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు సూరెడ్డి మణెమ్మ, ఉయ్యూరు పద్మ, అన్నవరపు జయలక్ష్మీ, ఈద పద్మ, కూనపురెడ్డి రజని, నాగమణి, పూజిత, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి సర్వే పనులు

కంకిపాడు: కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం సర్వే పనులు చేపట్టారు. పల్లె పండుగలో భాగంగా ప్రహరీ నిర్మాణానికి రూ.55 లక్షలు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనుల టెండరు దక్కించుకున్న టెండరు దారు ప్రహరీ నిర్మాణ పనులకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా తొలుత హద్దులు నిర్ణయిస్తూ సర్వే పూర్తి చేయించారు. సర్వే పనులను ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సంజయ్ పర్యవేక్షించారు.

ఎలక్ట్రికల్ వాహనాలపై ప్రజల్లో ఆసక్తి

పెనమలూరు: ఎలక్ట్రికల్ వాహనాల పట్ల ప్రజల్లో ఆసక్తి ఉందని జయలక్ష్మి ఆటో ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పోలవరపు గౌతమ్‌సాయి అన్నారు. పోరంకి మురళీ రిసార్ట్స్‌లో శుక్రవారం ఎంజీ మోటార్స్ ఎలక్ట్రికల్ వాహనాలు 100 ఒకేసారి పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగించాలని పిలుపు నివ్వటంతో ఎంజీ మోటార్స్ ఎలక్ట్రికల్ వాహనాలు అధునాతన టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎంజీ మోటార్స్‌లో వివిధ రకాల మోడల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీ మోటార్స్ సౌత్‌జోన్ సేల్స్ రీజినల్ మేనేజర్ ఎం.కిరణ్, సర్వీస్ ఏజీఎం షిఫాలీ, జయలక్ష్మి ఆటో ఎంటర్‌ప్రైజెస్ జీఎం శబరిరామ్, పలువురు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక

పెనమలూరు: మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నూతన సంఘం సభ్యులు వివరాలు వెల్లడించారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్నిక ఈవోపీఆర్డీ బొమ్మసానిశ్రీనివారావు ఆధ్వర్యంలో జరిగిందన్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.కూర్మారావు, అధ్యక్షుడిగా షేక్. కరీంఅహ్మద్, కార్యదర్శిగా తిరుమల వెంకరత్నం, ఉపాధ్యక్షులుగా బి.సునీత, డి.భాగ్యలక్ష్మి, కె.ఆశిష్, కోశాధికారి ఎం.శివనాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పి.షణ్ముఖ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి పి.క్రాంతికుమార్, సహప్రచార కార్యదర్శి ఆర్.ప్రసాద్, సహాయ కార్యదర్శి శ్రీరామ్ ఎన్నికయ్యారు.

లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

కంకిపాడు: కృష్ణా–గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజాసంఘాల బాధ్యులు శుక్రవారం కంకిపాడులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు పి.రంగారావు, టి.నరేష్, జి.కుమారి, సిహెచ్ శ్రీహరి, ఆర్.సుబ్బారావు, వి.శివశంకర్ తదతరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యాప్రగతి

ఉయ్యూరు: సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపడుతుందని ఫ్లోరా స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతు అన్నారు. స్థానిక పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం కొనసాగించారు. సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనను గౌతం విద్యా సంస్థల చైర్మన్ అవినాష్ సందర్శించారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నించి ప్రతిభ చాటిన వారిని అభినందించారు.

రశీదు ఇవ్వాలి

ఉంగుటూరు: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పక ఇవ్వాలని మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్ సూచించారు. ఉంగుటూరు, ఆముదాలపల్లి గ్రామాల్లోని పురుగు మందుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు.

ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

ఉయ్యూరు: ఉద్యోగుల సంక్షేమమే ప్రధానమని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని బైపాస్ మార్గంలో నిర్మించిన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉయ్యూరు తాలూకా యూనిట్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎన్‌జీఓ యూనిట్ భవనం నిర్మాణానికి స్థలం వితరణగా అందించిన సజ్జా వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ కృష్ణా సహాధ్యక్షుడు పి.రమేష్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఉయ్యూరు యూనిట్‌అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల బరితెగింపు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన అయిన రైతు బజారు, కార్మికుల కార్యాలయం తొలగింపు
- ప్రైవేటు వ్యక్తులతో నిర్మాణాలు ధ్వంసం
- తెరపైకి ప్రత్యామ్నాయ రహదారంటూ ప్రచారం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామస్తులు





రైతు బజారు నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిర్మాణమైన పునాదులు, పిల్లర్లు ధ్వంసం చేసి చదును చేసిన దృశ్యం (ఇన్‌సెట్) రైతు బజారు వద్ద గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

రామవరప్పాడు: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరగకపోగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన పూర్తి చేసుకున్న నిర్మాణాలను టీడీపీ నాయకులు కూలగొట్టిస్తున్నారు. రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ స్థలాన్ని ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణం మాటున తమ సొంత వ్యాపారాలకు వినియోగించుకోవడానికి పావులు కదుపుతున్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జాతీయరహదారి సమీపంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కార్మికుల కార్యాలయం, ఆయా గ్రామాల ప్రజల ప్రయోజనం కోసం రైతు బజారు ఏర్పాటుకై శంకుస్థాపన చేశారు. కార్మికుల భవన నిర్మాణం కూడా పూర్తయింది. సుమారు 40 సెంట్లలో రైతు బజారు నిర్మాణానికై గత ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ శాఖ నుంచి రూ.1.9 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రత్యామ్నాయ రహదారికి స్థలం వదిలి పునాదులు వేసి పిల్లర్లు సైతం నిర్మించారు. ఈలోపు వచ్చిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

అభివృద్ధి పనులు ధ్వంసం...

ఇప్పటి వరకు మండలంలో లేని కార్మికుల భవనం, రైతు బజారు నిర్మాణాలను తొలి నుంచి వ్యతిరేకిస్తున్న టీడీపీ నాయకులు ధ్వంసం చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. ఖాళీగా ఉన్న స్థలంపై కన్నేసిన వీరు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామ మాజీ ఉపసర్పంచ్, టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్ కుమార్, నాయకులు నభిగాని కొండ దగ్గరుండి తొలుత కార్మికుల భవనాన్ని ప్రైవేటు వ్యక్తులతో కూలగొట్టించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామస్తులకు ప్రయోజనం చేకూర్చే రైతు బజారును లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో పునాదులు పెకిలించి పిల్లర్లు ధ్వంసం చేయించారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరగక పోగా గత ప్రభుత్వంలో పునాదులు వేసుకున్న అభివృద్ధి పనులు కూడా అడ్డుకుని ధ్వంసం చేయడంతో పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెంట్రల్ జోన్ పోటీల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీఎస్ఆర్‌కె



అభినందిస్తున్న హెచ్‌ఎం దుర్గాభవాని

గన్నవరం: సెంట్రల్ జోన్ క్రీడా పోటీల్లో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు మోహని కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో కృష్ణా జిల్లా సెకండరీ పాఠశాలల సెంట్రల్ జోన్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఖోఖో సీనియర్స్, కబడ్డీ జూనియర్ విభాగాల్లో తమ పాఠశాల జట్లు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. 9వ తరగతి విద్యార్థి ఆర్. తేజేష్ 800 మీటర్ల రన్నింగ్‌లో బంగారు పతకం, మూడు కిలోమీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకం గెలుచుకున్నట్లు చెప్పారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన డి. నాగరాజు, ఎస్‌కె. మీరాసాహెబ్‌ను హెచ్‌ఎంతో పాటు ఖోఖో సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి టీఎస్ఆర్‌కె. ప్రసాద్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

సెంట్రల్ జోన్ పోటీల్లో

పెనమలూరు: సెంట్రల్ జోన్ గ్రిగ్ పోటీల్లో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి బహుమతులు గెలిచారు. 84వ గ్రిగ్ పోటీలు గోగినేనిపాలెంలో ఇటీవల జరగగా పలు పోటీల్లో పెనమలూరు పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. షటిల్ పోటీలో జి.ప్రకాష్ బాబు, బి.రోహిత్‌ఫణి, జూనియర్స్ విభాగంలో వి.సూర్యసాకేత్, ఎ.సుశీల్‌ప్రసాద్ గెలిచారు. ఎం.దుర్గాప్రసాద్ షాట్‌పుట్, డిస్కస్, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం వచ్చాడు. సబ్‌జోన్ కోకో పోటీల్లో బాలికల సీనియర్స్, జూనియర్స్ ద్వితీయ స్థానంలో గెలుపొందారు. అండర్ 14 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలో బి.ఆదిత్య డిస్కస్ త్రో, ఎస్‌కె.ఇంతియాజ్ షాట్‌పుట్‌లో గెలిచారు. కాగా పెనమలూరు పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ టి.విజయలక్ష్మిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని అభినందించారు.

జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీలో ప్రతిభ

పెనమలూరు: కానూరు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ జాతీయ స్థాయి ఏఐ హ్యాకథాన్ 2025 పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించి 8 థీమ్స్ లో ఏఐ ఆధారిత వినూత్న ప్రాజెక్టులను అభివృద్ధి చేసి సత్తా చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్) చైర్మన్ కె.మధుమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ ప్రభావం చాలా ఉంటుందన్నారు. పరిశ్రమల అభివృద్ధికి, విద్యార్థుల ఉపాధి అవకాశాలకు ఏఐ చాలా దోహదం చేస్తుందని చెప్పారు. విద్యార్థులు పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీల్లో మోహన్‌బాబు యూనివర్సిటీ విద్యార్థి రాహుల్ కోతూరికి ప్రథమ బహుమతి, ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి తేజకు ద్వితీయ బహుమతి వచ్చింది. టీవీఎస్ ఎంటర్‌ప్రైజెస్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్రన్‌స్రేబగర్, దీపక్ ఇండస్ట్రీస్ ఎండీ ఏవీ సుబ్రహ్మణ్యం, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, వైస్‌ఛాన్స్‌లర్ పి. వెంకటేశ్వరరావు, ప్రో వైస ఛాన్స్‌లర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.



పోటీలో గెలుపొందిన విద్యార్థులు

సుదీర్ఘకాలం పశుపోషణ అభినందనీయం

ఉయ్యూరు: సుదీర్ఘకాలంగా పశుపోషణ సాగిస్తుండటం అభినందనీయమని పశుసంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ టి.దామోదర్‌నాయుడు అన్నారు. పట్టణంలోని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన డెయిరీని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. దామోదర్‌నాయుడు మాట్లాడుతూ విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రమణ్యేశ్వరరావు పశుపోషణపై దృష్టి సారించటం ప్రశంసనీయమన్నారు. డెయిరీ సంరక్షణ, పాడి పశువుల పోషణకు అవసరమైన సహాయ సహకారాన్ని సంస్థ అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీహెచ్‌ఓ చిన నరసింహులు, డీడీ గోపిచంద్, ఏడీ రామశేఖర్, విద్యాసంస్థల ప్రతినిధులు మాదల సుబ్రమణ్యేశ్వరరావు, మాదల సూర్యశేఖర్, సుష్మ పాల్గొన్నారు.

ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రికి నేత్రదానం

పెనమలూరు: తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దాత మరణానంతరం తన నేత్రాలు దానం చేశాడు. కానూరుకు చెందిన వెలిశిల కోటేశ్వరరావు (78) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి కోటేశ్వరరావు నేత్రాలను దానం చేశారు. శుక్రవారం ఎల్‌వి.ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది వచ్చి కార్నియా సేకరించారు. కాగా కోటేశ్వరరావు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కావటంతో పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దేవభక్తుని సుబ్బారావు, పెనమలూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో నేటి నుంచి శ్రీకోదండరామస్వామి దివ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 12వ తేదీన పలు పూజా కార్యక్రమాల అనంతరం శ్రీకమలానందభారతిస్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తారు. ఇక 13వ తేదీన ఉదయం 8 గంటలకు గోపూజ, యంత్రస్థాపన పూజలు చేసి సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీకోదండ స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, జయ విజయ ద్వార పాలకులు, శిఖరం, ధ్వజస్తంభ ప్రతిష్ట చేస్తారు. బ్రహ్మశ్రీ చందూరి సీతారామాంజనేయప్రసాద్ అనుగ్రహ భాషణం చేస్తారు.

గేమ్ డిజైనింగ్‌పై శిక్షణ

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గేమ్ డిజైనింగ్ పై వారం రోజులు శిక్షణ తరగతులు నిర్వహించామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. కాలేజీలో శుక్రవారం శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గేమ్ డిజైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, గేమ్ లెవల్స్, ఆనిమేషన్, ఫిజిక్స్ అప్లికేషన్, క్యారక్టర్ మోషన్, తదితర అంశాల పై శిక్షణతో పాటు ప్రాజెక్టులు చేయించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పెనమలూరు సెక్షన్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. గంగూరు సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా పెనమలూరు సెక్షన్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా గంగూరు, పెనమలూరు, గోసాల, వణుకూరు, చోడవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉంగుటూరు: ఉంగుటూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8.30నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫర నిలిపివేస్తున్నట్లు ఏఈ జీబీ శ్రీనివాస్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు, ఆముదాలపల్లి, ఎలుకపాడు, లంకపల్లి, గారపాడు, కొయ్యగూరపాడు, నాగవరప్పాడు, తుట్టగుంట, వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పల గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రబీ సీజన్‌లో మినుము పంట సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణకు తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం కాకులపాడులో పొలం బడి కార్యక్రమంలో భాగంగా మినుము పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతవారణంలో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం, గాలిలో తేమ శాతం అధికంగా ఉండటంతో మినుము, పెసర పంటలకు తెగుళ్లు అధికంగా సోకే అవకాశం ఉందని చెప్పారు. పలువురు రైతుల పొలాల్లో మినుము పంటకు మారుకా మచ్చల పురుగులు సోకినట్లుగా గుర్తించామని వివరించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో అడ్మిషన్ల కోసం శనివారం నిర్వహించబోయే ఎంట్రన్స్ టెస్ట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో 9వ తరగతి అడ్మిషన్ కోసం 607 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా, బాపులపాడు, వీరవల్లి జెడ్పీ హైస్కూళ్లు, వేలేరు నవోదయ విద్యాలయంలో వీరికి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 11వ తరగతి అడ్మిషన్ కోసం 924 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి గన్నవరంలో రెండు, ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో ఒక పరీక్షా కేంద్రాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు జారీ చేశామని వివరించారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

17 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాల విద్యార్థులు 17 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు 150 మంది ఈ డ్రైవ్‌కు హాజరయ్యారన్నారు. వీరికి రాతపరీక్ష, గ్రూప్ డిస్కర్షన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించగా 17 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి సంవత్సరానికి రూ.3.60 లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీ కృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి శివనాగేశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

280 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెనమలూరు: పీడీఎస్ బియ్యం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నంకు చెందిన తాడికొండ ఏకాంబరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పీడీఎస్ బియ్యం సేకరించి అక్రమంగా అమ్ముతుంటాడు. ఈ నేపథ్యంలో 280 కేజీల పీడీఎస్ బియ్యం సేకరించి ఏడు మూటలు కట్టి ఆటోలో బియ్యాన్ని మచిలీపట్నంకు తరలిస్తుండగా పోలీసులు తాడిగడపలో అదుపులోకి తీసుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుకొని ఆటోను సీజ్ చేశారు. ఏకాంబరం పై కేసు నమోదు చేశారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన దేవభక్తుని

కంకిపాడు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి నేతృత్వంలో పార్టీ శ్రేణులు శుక్రవారం ఆత్మీయంగా కలిశారు. గన్నవరం విమానాశ్రయంలో వైఎస్ జగన్‌ను కలిసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. →



వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న పార్టీ పెనమలూరు సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్

నులి పురుగుల నిర్మూలన టాబ్లెట్స్ పంపిణీ

అంబాపురం(విజయవాడరూరల్): ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు నులి పురుగుల నిర్మూలన టాబ్లెట్స్ వేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాధురిదేవి అన్నారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆరోగ్యకేంద్రాల్లోని వైద్య సిబ్బందికి నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్స్‌ను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురిదేవి మాట్లాడుతూ చిన్న పిల్లల నుంచి 18 సంవత్సరాలు వయస్సు పై బడిన వారందరూ టాబ్లెట్స్ వేసుకొనేలా చూడాలని కోరారు. కడుపులో నులి పురుగులు ఉండటం వలన రక్తం తగ్గిపోయి బలహీనంగా కనిపించడం, బరువు తగ్గడం, ఆకలి లేదనడం, ఒక్కోసారి విరోచనాలు చేసుకోవడం లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. వాటిని గుర్తించి పిల్లలకు నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్స్‌ను తల్లిదండ్రులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ గోపాలరావు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



నులిపురుగు టాబ్లెట్స్ అందచేస్తున్న డాక్టర్ మాధురిదేవి

వేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కల్యాణ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన తెంపల్లి వేణుగోపాలస్వామి ఆలయం



అలంకార రూపంలో దర్శనమిచ్చిన వేణుగోపాలస్వామి

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గోదా రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రార్థన, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, రుత్విక్‌వరణము, మృత్సంగ్రహణ, అంకురారోపణ, అగ్నిప్రతిష్టాపన, మూర్తికుంభ ప్రతిష్టాపన ధ్వజారోహనం, గ్రామబలిహరణ, తీర్థగోష్ఠి పూజలను వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కోసూరు కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో పెద్ద ముత్తేవి పీఠాధిపతి కృష్ణ స్వామీజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి వారి భక్త బృందం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

కంకిపాడు: పాడిరైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. 60 ఏళ్ల వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ప్రొద్దుటూరు పాలకేంద్రంలో శుక్రవారం పాడిరైతుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ చలసాని ఆంజనేయులు హాజరై సుదీర్ఘకాలంగా కృష్ణా మిల్క్ యూనియన్‌లో భాగస్వాములుగా ఉన్న పాడి రైతులను సత్కరించి అభినందించారు. ప్రభుత్వ, కార్పొరేట్ రంగ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ పాడి రైతులుగా కొనసాగుతున్న రైతులను గుర్తించి అభినందించారు. చైర్మన్ మాట్లాడుతూ పాడిరైతులకు అన్ని విధాలా యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. పాడిరైతుల అభ్యున్నతి దిశగా పాటుపడుతున్నామని వివరించారు. వజ్రోత్సవాలను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. పాడిరైతులు చైర్మన్ ఆంజనేయులను సన్మానించారు. విజయట్రస్టు డైరెక్టర్, పాల కేంద్రం అధ్యక్షుడు జొన్నల కోటిరెడ్డి, ఏజీఎం చల్లా అన్వేష్‌కుమార్, మేనేజర్ యశ్వంత్, సూపర్‌వైజర్ సుధాకర్, కార్యదర్శి మసిముక్కు రవి, మసిముక్కు రాంబాబు, పాడిరైతులు పాల్గొన్నారు.



చైర్మన్ ఆంజనేయులును సత్కరిస్తున్న పాల కేంద్రం అధ్యక్షుడు కోటిరెడ్డి, ఇతర పాడిరైతులు

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

గన్నవరం రూరల్: డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆత్కూరు ఎస్సై సురేష్ అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ వ్యక్తి ఉన్నతికి ప్రతిబంధకాలైన మత్తు పదార్థాల జోలికి పోకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే జీవితంలో కోరుకున్న లక్ష్యానికి చేరుకుంటారని చెప్పారు. స్నేహితులు ఒత్తిడి చేశారనో అందరు చేస్తున్నదే కదా అనో తేలిగ్గా తీసుకుని మత్తు పదార్థాలను సేవిస్తూ కూర్చుంటే వ్యసనాలుగా మారి వాటికి బానిసలు అవుతారని వివరించారు. మత్తు పదార్థాలు అలవాటు చేసుకోవటం ఎంత సులభమో మానుకోవటం అంతే కష్టమని చెప్పారు. ఎంత నష్టం జరుగుతుందో అని గుర్తించేలోపే భవిష్యత్ అగమ్యగోచరం అవుతుందన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.శివకుమారి తదితరులున్నారు.

మోసగించిన మెకానిక్ పై కేసు

పెనమలూరు: కారు రిపేర్ చేస్తానని మోసిగించి సొమ్ము కాజేసిన మెకానిక్ పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ సింగ్ నగర్ ఆంధ్రప్రభ కాలనీకి చెందిన సంగెపు కిరణ్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. బుడమేరు వరదల కారణంగా ఆయన కారు వరద నీటిలో మునిగి పాడయింది. దీంతో కారు రిపేర్ చేయటానికి పోరంకి వద్ద కారు రిపేర్ చేసే మెకానిక్ అబ్దుల్‌అజీజ్‌ను కలువగా రిపేర్ చేయటానికి రూ.50 వేలు అవుతుందని తెలిపాడు. దీంతో కిరణ్ అడ్వాన్స్‌గా రూ.30 వేలు సెప్టెంబర్ నెలలో మెకానిక్‌కు ఇచ్చాడు. కారు 20 రోజుల్లో రిపేర్ చేసి ఇస్తానని మెకానిక్ చెప్పాడు. అయితే మెకానిక్ కారు రిపేర్ చేయలేదు. ఫోన్ చేస్తే ఎత్తటం లేదు. దీంతో కిరణ్ మరో మెకానిక్‌తో కలిసి కారు షెడ్డు వద్దకు వచ్చి కారును చూడగా కారులో రూ.3 లక్షల విలువ చేసే పార్టులు మాయం చేసినట్లు గుర్తించాడు. ఈ ఘటన పై కారు యజమాని కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.